క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడిపల్లి: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా మేడిపల్లిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. మేడిపల్లి ప్రధాన రహదారి శ్రీసాయి హాస్పిటల్ నుంచి అపెక్స్ మెయిన్ రోడ్డు, 11కేవీ మేడిపల్లి ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. వినాయక్ నగర్ ఓంవిహార్ కాలనీ, భరత్‌పురి కాలనీ, మారుతి నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని వివరించారు.

ఉప్పల్ పారిశ్రామికవాడలో...

ఉప్పల్: ఉప్పల్ పారిశ్రామికవాడలోని 11 కేవీ ఎగ్‌వుడ్ ఫీడర్ పరిధిలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు నిలిపివేయనున్నట్లు ఏడీఈ బాలకృష్ణ తెలిపారు. 11 కేవీ నవభారత్ ఫీడర్ పరిధిలోని ఉప్పల్ ఎక్స్ రోడ్, ఎన్ఆర్‌బీ బేరింగ్స్, ఉప్పల్ పారిశ్రామిక వాడలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కాంగ్రెస్ మహిళా విభాగం అధ్యక్షురాలిగా నవనీత

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్ కాంగ్రెస్ మహిళా విభాగం అధ్యక్షురాలిగా నాగారం నవనీత నియమితులయ్యారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నవనీత మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు మేరీ, శ్రీనివాస్‌గౌడ్ ,రాములు, సానాది శంకర్,పద్మ తదితరులు పాల్గొన్నారు.

కూలిన చెట్టు.. తప్పిన ప్రమాదం

కాప్రా: ఆదిత్య నగర్‌లో వెంట్రుకవాసిలో ఓ పెను ప్రమాదం తప్పింది. ఆదివారం టిప్పర్ వెళ్తున్న సమయంలో ఓ భారీ వృక్షం నేలకూలి టిప్పర్‌పై పడింది. రోడ్డుపైకి వచ్చిన చెట్టు కొమ్మలు టిప్పర్‌కు తగలడంతో.. అప్పటికే కూలేందుకు సిద్ధంగా భారీ వృక్షం టిప్పర్‌పై కూలింది. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న మాన్‌సూన్ సిబ్బంది, పోలీసులు సంఘటనాస్థలికి చేరుకున్నారు. టిప్పర్‌పై కూలిన వృక్షాన్ని తొలగించారు. నగరంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ సూచించారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు చెట్ల కింద ఉండొద్దని తెలిపారు. ఎస్‌ఐ ఉపేందర్‌యాదవ్, మాన్‌సూన్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

అల్వాల్: కాంగ్రెస్ పార్టీతోనే మల్కాజిగిరి నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. కాలనీ నేస్తం–కాంగ్రెస్ హస్తం పేరుతో ఆదివారం వెంకటాపురం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో ఆయన ఇంటింటికీ తిరుగుతు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారు. శ్రీధర్ మాట్లాడుతూ... రానున్న ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు. నిమ్మ అశోక్‌రెడ్డి, కృష్ణగౌడ్, శ్రీనివాస్, సంజీవ్‌కుమార్, సూర్యప్రకాష్‌రెడ్డి, పవన్, శివకుమార్, సాయికుమార్, ప్రభాకర్, బాలవీర్, సంజీవరెడ్డి, ఆశారాణి పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఉంటా

● మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: అసంఘటిత రంగ కార్మికులకు అండగా ఉంటామని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. ఆదివారం భారతీయ మజ్దూరు సంఘ్ (బీఎంఎస్) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆనంద్‌బాగ్‌లో డీసీఎం డ్రైవర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జెండాను ఆవిష్కరించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ... కార్మికులకు అండగా బీఎంఎస్ ఎల్లప్పుడూ ఉంటుందని, వారి సమస్యలను పరిష్కరించి అందుబాటులో ఉంటామన్నారు. రవిశంకర్, నేతలు యాదగిరి, సురేందర్, అంజయ్య, సుధాకర్, కృష్ణ పాల్గొన్నారు.

నివాళి

మల్కాజిగిరి: కెప్టెన్ లక్ష్మీ సెహగల్ జీవితం స్ఫూర్తిదాయకమని ఐద్వా మేడ్చల్ జిల్లా కార్యదర్శి వినోద అన్నారు. ఆదివారం మల్కాజిగిరిలోని పార్టీ కార్యాలయంలో మండల కమిటీ కార్యదర్శి పి.మంగ ఆధ్వర్యంలో లక్ష్మీ సెహగల్ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. రాజ్యలక్ష్మి, చిట్టెమ్మ, లక్ష్మి, బుజ్జి పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణంలో ఆలస్యంపై ఆందోళన

మల్లాపూర్: నాచారం డివిజన్ అన్నపూర్ణ కాలనీ వీధి నెంబర్–7లో కాంట్రాక్టర్ రోడ్డు వేయడంలో ఆలస్యం చేస్తున్నారంటూ ఆదివారం కాలనీ వాసులు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ వచ్చి వారితో మాట్లాడి ఆందోళనను విరమింపజేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ... సీసీ రోడ్డు కోసం రూ. 36 లక్షలు మంజూరు చేయించామన్నారు. తొందర్లోనే పనులను కాంట్రాక్టర్ ప్రారంభించకుంటే తిరిగి టెండర్ వేసి మరో కాంట్రాక్టర్‌తో పనులను చేయిస్తామని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. నేతలు జంగయ్య యాదవ్, విఠల్ యాదవ్, కిషోర్, శ్రీనివాస్, మోయినుద్దీన్, బాబురావు, మాన్సూర్, లలిత, సుబ్బయ్య పాల్గొన్నారు.



హెచ్‌బీ కాలనీలో అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి



చెంగిచర్ల బోనాల ఉత్సవాలకు హాజరైన మంత్రి మల్లారెడ్డి



నాచారంలో మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, బండారి లక్ష్మారెడ్డి



కుషాయిగూడలో ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు



చర్లపల్లి బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్



బోనం.. వైభోగం

అంగరంగ వైభవంగా శ్రావణమాస బోనాలు

భక్తులతో కిటకిటలాడిన అమ్మవారి ఆలయాలు

బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్న మహిళలు

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ప్రముఖులు

ఉప్పల్: ఉప్పల్‌లో నల్ల పోచమ్మ, పోచమ్మ అమ్మవార్ల శ్రావణమాస బోనాల జాతరను ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు బండారి లక్ష్మారెడ్డి, టీడీపీ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు కందికంటి అశోక్ కుమార్ గౌడ్ మందుముల పరమేశ్వర్‌రెడ్డి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు మేకల శివారెడ్డి, దుబ్బ నర్సింహారెడ్డి, పోగులు దయాకర్‌రెడ్డి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు నిర్వహించారు.

మల్లాపూర్, నాచారంలో...

మల్లాపూర్: మల్లాపూర్, నాచారంలో బోనాల వేడుకలను వైభవంగా నిర్వహించారు. మల్లాపూర్ ఈదమ్మ, వెంకటరమణ కాలనీలోని ఆరె పోచమ్మ, జనప్రియ, సూర్యానగర్ కాలనీలో అమ్మవార్లకు మహిళలు బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నాచారం ఎర్రకుంటలోని శ్రీ మాతా నల్ల పోచ్మమకు బోనాలను సమర్పించారు. అనంతరం పోతురాజుల నృత్యాల ఊరేగింపుతో తొట్టెలను తీశారు. సంబరాల్లో ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, బండారి లక్ష్మారెడ్డి, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్, మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

కాప్రా సర్కిల్ పరిధిలో...

కాప్రా: కాప్రా సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. కుషాయిగూడ, చర్లపల్లి, మీర్‌పేట్‌హెచ్‌బీ కాలనీలోని అమ్మవార్ల ఆలయాల్లో మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్లు ధన్‌పాల్‌రెడ్డి, గుండారపు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని ఆయా కాలనీల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కౌకూర్, భరత్‌నగర్, బర్షిపేటల్లో...

అల్వాల్: బోనాల వేడుకలు యాప్రాల్‌లోని కౌకూర్, భరత్ నగర్, బర్షిపేట తదితర ప్రాంతాలలో ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, స్థానిక కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్, ఏసీపీ వెంకట్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్‌సీతారామ్‌లు అమ్మవారికి దర్శించుకున్నారు. నాయకులు మల్లికార్జున్, లక్ష్మణ్‌యాదవ్, సతీష్, వెంకటేష్‌యాదవ్, రాజేష్, హనుమాన్‌చారి, విక్రమ్, నగేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



నల్ల పోచమ్మను దర్శించుకున్న కార్పొరేటర్ రజిత



ఉప్పల్‌లో .. కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ



బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న వజ్రేష్ యాదవ్



మల్లాపూర్‌లో బోనాలతో వెళ్తున్న మహిళలు



కాకూర్‌లో ఎమ్మెల్యే, కార్పొరేటర్...



కావేరీ నగర్‌లో కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్



ఉప్పల్ పద్మావతి కాలనీలో ఎమ్మెల్యే బేతి తదితరులు



ఉప్పల్ నల్ల పోచమ్మ ఆలయంలో బోనాలను సమర్పిస్తున్న భక్తులు



చర్లపల్లిలో బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న రాగిడి లక్ష్మారెడ్డి

అంతర్జాతీయ వేదికపై తెలంగాణ ఖ్యాతి

● పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డికి అరుదైన గౌరవం
● బంగ్లాదేశ్‌లో జరిగిన సౌత్ ఏషియన్ ఎక్స్ఛేంజ్ ఆన్ పబ్లిక్ శానిటేషన్ సదస్సులో మేయర్
● రాష్ట్రంలో పబ్లిక్ శానిటేషన్ ఫై ప్రసంగం

మేడిపల్లి: అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా వాటర్ ఎయిడ్ సౌత్ ఏషియా భాగస్వామ్యంతో బంగ్లాదేశ్, నేపాల్, భారతదేశంలోని పలు ప్రాతాంల్లో అమలు జరుగుతున్న పబ్లిక్ శానిటేషన్‌పై ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు అధ్యయన సదస్సు జరిగింది. ఢాకా నార్త్ సిటీ కార్పొరేషన్ మేయర్ అతికుల్ ఇస్లాం, నేషనల్ ప్రెస్‌క్లబ్ జనరల్ సెక్రటరీ శ్యామల్ దత్తా అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో తెలంగాణ నుంచి పాల్గొన్న పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్న పబ్లిక్ శానిటేషన్ విధానాలపై సదస్సులో ప్రసంగించారు. ఐదు రోజుల పర్యటన ముగించుకొని వచ్చిన మేయర్ ఆదివారం స్టడీటూర్ విషయాలను మీడియాతో పంచుకున్నారు. హానికరమైన మలవ్యర్థాల నిర్వహణకు రూ. 428 కోట్లతో 141 పట్టణాలల్లో ఎఫ్ఎస్టీపీలను నిర్మించేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకుంది.. ఇందులో ఇప్పటికే పీర్జాదిగూడతోపాటు మరో 25 మున్సిపాలిటీలలో ఎఫ్ఎస్టీపీలు అందుబాటులోకి వచ్చాయి. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న శానిటేషన్ విధానాల పట్ల బంగ్లాదేశ్, నేపాల్ దేశాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేయడంతో పాటు తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్న పబ్లిక్ శానిటేషన్ విధానాలను స్ఫూర్తిగా తీసుకొని ఢాకా నగరంలోనూ అమలు చేయనున్నట్లుగా ఢాకా నగర మేయర్ సౌత్ ఏషియన్ ఎక్స్ఛేంజ్ ఆన్ పబ్లిక్ శానిటేషన్ 2023 సదస్సులోనే వెల్లడించారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబంలో వ్యక్తిగత మరుగుదొడ్లను కలిగి ఉండటం వలన ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని మున్సిపాలటీలు పరిశుద్ధ పట్టణాలుగా కీర్తి గడిస్తున్నాయి. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వం మెజారిటీ పట్టణాలను ఓడీఎఫ్‌ప్లస్‌ప్లస్ పట్టణాలుగా గుర్తించడంతో పాటు వివిధ విభాగాల్లో సుమారు 26 అవార్డులను తెలంగాణ దక్కించుకోవడం తెలంగాణ పట్టణ ప్రగతికి నిదర్శనంగా చెప్పవచ్చు అని మేయర్ జక్క వెంకట్ రెడ్డి వివరించారు.



సదస్సులో మాట్లాడుతున్న పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి



సదస్సులో ప్రతినిధులతో మేయర్

విద్యార్థులు మాతృభాషపై పట్టు సాధించాలి



ఆన్‌లైన్ ద్వారా సాహిత్య సప్తాహ కార్యక్రమం

మల్కాజిగిరి: విద్యార్థులకు మాతృభాషపై పట్టు సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏపీ ప్రభుత్వ నంది అవార్డు గ్రహీత , సినీ గేయ రచయుత సాధనాల వెంకటస్వామి నాయుడు అన్నారు. ఆదివారం అక్షర కౌముది సాహిత సామాజిక సేవా సంస్థ నాల్గవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని దాశరథి, సినారె జయంతి సందర్భంగా సాహిత్య సప్తాహ కార్యక్రమాన్ని ఆయన ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి నాయుడు మాట్లాడుతూ... ఇప్పుడిప్పుడే ప్రభుత్వాలు కూడా అనేక పాఠశాలల్లో విద్యాబోధన మాతృభాషలో ఉండేలా చర్యలు తీసుకోవడం హర్షణీయమన్నారు. విద్యార్థులకు కూడా భాషపై పట్టు ఉండాలంటే ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడుతాయన్నారు. నిర్వాహకులు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో భీంపల్లి శ్రీకాంత్, సీత లక్ష్మి, తిరుపతిరెడ్డి, శ్రీదేవి, వెంకటకృష్ణ, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రీకాస్టెడ్ విధానంలో ఆర్‌యూబీని నిర్మించాలి

మల్కాజిగిరి: వాజ్‌పేయినగర్ రైల్వే లెవెల్ క్రాసింగ్ వద్ద ప్రీ కాస్టెడ్ బాక్స్‌లతో ఆర్‌యూబీ నిర్మాణాన్ని చేపట్టాలని సబర్బన్ బస్ అండ్ ట్రైన్ ట్రావెలర్స్ అసోషియేషన్ కార్యదర్శి నూర్ కోరారు. ఆ మార్గంలో ప్రస్తుతం గూడ్స్ రైళ్లు ప్రయాణిస్తున్నాయని, భవిష్యత్తులో ఎంఎంటీఎస్ రైళ్లు ప్రయాణిస్తే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. ఇప్పుడే రైల్వే గేటు వేసినపుడు ఎక్కువ సమయం వేచి చూడాల్సి వస్తుండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ముఖ్యంగా అంబులెన్స్‌లు కూడా ఆగిపోయే పరిస్థితి ప్రస్తుతం ఉందన్నారు. ప్రీ కాస్టెడ్ బాక్స్‌లతో నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయవచ్చునన్నారు. ఆ దిశలో చర్యలు తీసుకోవాలని రైల్వే అధికారులకు విజ్ఞప్తి చేశామన్నారు. ఈ విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులు కూడా చొరవ చూపాలని కోరారు.